ప్రజాశక్తి

సోమవారం 28 ఏప్రిల్ 2025 5

శ్రీ సత్యసాయి





ట్రోఫీతో విజేత జట్టు

ముగిసిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు జట్టుకు ప్రథమ స్థానం

2,3 స్థానాల్లో పశ్చిమగోదావరి, శ్రీ సత్యసాయి జట్లు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 54వ సీనియర్ పురుషుల హ్యాండ్ బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు ప్రతిభ చాటి విజేతగా నిలిచి ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. రెండవ స్థానం పశ్చిమ గోదావరి, మూడవ స్థానం శ్రీసత్యసాయి జిల్లా జట్లు నిలిచాయి. పోటీల ముగింపు సందర్భంగా కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కెనరా బ్యాంకు మేనేజర్ విజయకుమార్, పేబ్యాక్ సంస్థ అధ్యక్షులు ధనుంజయ నాయుడులు పాల్గొన్నారు. విజేతలకు ట్రోఫీలు, పథకాలు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీల అధ్యక్ష, కార్యదర్శులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచని గుత్తి రైల్వే జంక్షన్

- స్టేషన్ మీదుగా వెళుతున్న ఆగని పది రైళ్లు
- నాలుగు రైళ్ళను దారి మళ్లించిన వైనం
- స్టేషన్లో సమస్యల తిష్ట



గుత్తి రైల్వే జంక్షన్

ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన గుత్తి రైల్వే జంక్షన్ అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచింది. ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడ నెలకొన్న సమస్యలు పరిష్కారం కావడం లేదు. 157 ఏళ్ల క్రితం నిర్మించిన రైల్వే జంక్షన్‌లో నాలుగు రైలు మార్గాలు ఉన్నాయి. చెన్నై-ముంబాయి, బెంగుళూరు-హైదరాబాదుకు రైలు మార్గాలు ఉన్నాయి. గుత్తి రైల్వే స్టేషన్ మీదుగా 122 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. స్టేషన్లో రెండు ఫ్లాట్‌ఫాంలు మాత్రమే ఉన్నాయి. అదనంగా నిర్మిస్తున్న మరో రెండు రైల్వే ప్లాట్‌ఫారం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆ పనులు పూర్తి చేస్తే స్టేషన్లో మరిన్ని రైళ్లు ఆగేందుకు అవకాశం ఉంది.

ప్రజాశక్తి - గుత్తి

గుత్తి రైల్వే సేష్టన్ మీదుగా ప్రతిరోజు దాదాపు 30 రైళ్లు వెళ్తుండగా అందులో 24 ఎక్స్ ప్రెస్, 6 ప్యాసింజర్ రైళ్లు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. అధికంగా రైళ్లు వారానికి ఒకటి, రెండుసార్లు స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే ఈ మార్గాల గుండా నిత్యం దాదాపు 60 గూడ్స్ రైళ్లు వెళుతున్నాయి. వాటి ద్వారా బొగ్గు, ఐరన్ ఓర్, సిమెంటు కంకర, ఆహార ధాన్యాలను రవాణా చేస్తున్నారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి దేశ రాజధానికి ప్రజలు వెళ్లడానికి ఒక రైలు కూడా లేదు. వందలాది రైళ్లు, వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న రైల్వే స్టేషన్ లో సమస్యలు తిష్ట వేశాయి. రాకపోకలు సాగిస్తున్న పది రైళ్లు స్టేషన్లో ఆగడం లేదు. తిరుపతి -హజరత్ నిజామొద్దీన్ (12708,12707), సంపర్క్ క్రాంతి ఎక్స్ ప్రెస్ రైళ్లు, కాచిగూడ- మదురైకు రాకపోకలు సాగించే ఎక్స్ ప్రెస్ రైళ్లు (22715,22716), జైపూర్-మైసూర్‌కు రాకపోకలు సాగించే రైళ్లు (12975,12976), యశ్వంతపూర్- కోర్గా (12251,12252) ఎక్స్ ప్రెస్ రైళ్లు, రామేశ్వరం- ఓకాకు వెళ్లి వస్తున్న ఎక్స్ ప్రెస్ రైళ్లు (16733,16734), కొంగు సూపర్ ఫాస్ట్ (12647,12648) రైళ్లతోపాటు కాచిగూడ- యశ్వంత్ పూర్ కు వెళ్లే వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లు గుత్తి మీదుగా వెళుతున్నా స్టేషన్లో ఆగటం లేదు. గతంలో గుత్తి రైల్వే స్టేషన్ గూండా వెళ్లే కర్నాటక ఎక్స్‌ప్రెస్(12627,12628), కుర్లా ఎక్స్ ప్రెస్ (11013,11014) రైళ్లు దారి మళ్లించారు. అనంతపురం నుంచి గుంతకల్లు మీదుగా ఆ రైళ్లు వెళుతున్నాయి.గుత్తి మీదుగా వెళుతున్న విజయవాడ నుంచి బెంగళూరు ప్యాసింజర్ రైళ్లు (56503,56504) కరోనా సమయంలో రైల్వే అధికారులు నిలిపివేశారు. నాలుగు రైళ్లు దారి మళ్లింపు, రెండు రైళ్లు రద్దు చేయడంతో గుత్తితో పాటు చుట్టు ఉన్న ప్రాంతాల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రైల్వే స్టేషన్ లో ఉన్న దుకాణాదారులు, స్టేషన్ బయట ఉన్న దుకాణదారులకు వ్యాపారాలు తగ్గి ఉపాధి కోల్పోయారు. ఆటో డ్రైవర్ల జీవనోపాధికి గండిపడింది. స్టేషన్ నూతన భవనాల నిర్మాణం, అదనపు ఫ్లాట్ ఫాంలు ఏర్పాటు కోసం గత ఏడాది ఆఖరిలో రూ.354.33 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే ఇప్పటికి పనులు ప్రారంభం కాలేదు. స్టేషన్ లోకి ప్రయాణికులు వెళ్లడానికి ఎక్కులేటర్ లేదు. శిఖరంలా నిర్మించిన మెటికల మీదుగా వృద్ధులు, పిల్లలు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్లాట్‌ఫాంలో ఉన్న లిఫ్టు వారంలో రెండు మూడు రోజులు మాత్రమే పనిచేస్తుంది. ఉన్న రెండు లిఫ్టులు మొరాయిస్తే ప్రయాణికులు, రైల్వే అధికారులు, కార్మికులు, సిబ్బంది, అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. స్టేషన్లో తాగునీటి సమస్య నెలకొంది. ఫ్లాట్ ఫాంలపై ఏర్పాటు చేసిన కొళాయిలకు కొన్నింటికి మాత్రమే నీరు వస్తోంది. ఫ్లాట్ ఫాంలలో ఒకవైపు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. మరొక వైపు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. స్టేషన్లో కోతుల బెడద అధికంగా ఉంది. ప్రయాణికులు తీసుకెళ్తున్న తినుబండారాల కోసం కోతులు దాడులు చేస్తున్నాయి. కోతుల దాడితో ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. టికెట్టు బుకింగ్ కార్యాలయం వద్ద ఉన్న ఎస్‌బిఐ ఎటిఎం కేంద్రం తరచూ మూతపడుతోంది. తద్వారా నగదు కోసం ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, రైల్వే అధికారులు స్పందించి గుత్తి మీదుగా వెళుతున్న రైళ్లను స్టేషన్లో ఆగేలా, దారి మళ్లించిన రైళ్లను గుత్తి రైల్వే స్టేషన్ మీదుగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. అదే విధంగా త్వరతగతిన గుత్తి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలంటున్నారు.

జీవనోపాధి కోల్పోయాం



గుత్తి రైల్వే స్టేషన్ మీదుగా వెళుతున్న నాలుగు రైళ్లను దారి మళ్లించారు. విజయవాడ-బెంగళూరు ప్యాసింజర్ రైలు కరోనా సమయంలో రద్దు చేశారు. ఆ రైలు రాకపోకలు లేకపోవటంతో తమ వ్యాపారాలు తగ్గి ఉపాధి కోల్పోతున్నాం. గుత్తి మీదుగా వెళుతున్న 10 రైళ్లు స్టేషన్లో నిలిపాలి. దారి మళ్లించిన నాలుగు రైళ్లను గుత్తి రైల్వే స్టేషన్ మీదుగా నడపాలి. రద్దు చేసిన విజయవాడ - బెంగళూరు రైలును కొనసాగించాలి.

కెఎం.రంగనాయకులు,
దుకాణదారుడు,
గుత్తి ఆర్ఎస్.

అభివృద్ధి పనులు ప్రారంభించాలి



గుత్తి రైల్వే స్టేషన్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. పలు రైళ్లను గుత్తిలో ఆపకపోవటం, దారి మళ్లించడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుత్తి, పరిసర ప్రాంతాల ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం కేటాయించిన రూ.354 కోట్ల నిధులతో రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టాలి. నూతన భవనాలను నిర్మించి, ఫ్లాట్ ఫాంల సంఖ్య పెంచాలి.

వి.నిర్మల,
సిపిఎం మండల కార్యదర్శి,
గుత్తి.



రైల్వే స్టేషన్‌లో పనిచేయని తాగునీటి కొళాయిలు



రైల్వే స్టేషన్‌లో ఎత్తైన మెట్లు

నాలుగు దశాబ్దాల కల సాకారం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం కె బసవన పల్లి-కోటిపి లింక్ రోడ్డు నిర్మాణంతో ఆయా కాలనీవాసులు నాలుగు దశబ్దల కల సాకారం అవుతోంది. కెరికెర పంచాయతీ బసవనపల్లి గ్రామం నుండి ఇందిరమ్మకాలనీ, భరత్ నగర్ మీదుగా లోయోలా స్కూల్ వరకు రోడ్ నిర్మించాలని ఆయా ప్రాంతాల ప్రజలు పలు మార్లు పాలకులకు, అధికారులకు విన్నవించారు. అయినప్పటికి ఎవరు పట్టించు కోలేదు. దీంతో 2024 ఎన్నికల సమయంలో నిర్వహించిన ప్రచారంలో సమస్యను స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధర దేవికి ప్రజలు వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డును ఏర్పాటు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఇచ్చిన హామి మేరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 60లక్షలతో రోడ్డు పనులను ప్రారంభించారు. పనులు పూర్తి అవుతున్న సందర్భంగా ఆదివారం కిరికెర మాజీ సర్పంచి రాము అక్కడికి వెళ్లి పనులను పరిశీలించారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని అన్నారు.

కార్మికుని కుటుంబానికి అండగా ఉంటాం

హిందూపురం : ఇటీవల మృతిచెందిన హిందూపురం పురపాలక సంఘంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుడు బి. పెంచలయ్య కుటుంబానికి అండగా ఉంటామని మున్సిపల్ ఛైర్మేన్ రమేష్ కుమార్ చెప్పారు. ఈ మేరకు ఆయన ఆదివారం మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించడంతో పాటు కుటుబంలో ఒకరికి ఉద్యోగం వచ్చే విధంగా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుమో శీన, దుర్గా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

30న 'పురం'లో అంబేద్కర్ జీవితచరిత్ర పై నాటకం

కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర పై ఈ నెల 30వ తేదీన నాటికను ప్రదర్శిస్తున్నట్లు కుల వివక్ష పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ తెలిపారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 30వ తేదీన పట్టణంలోని బిపిఎల్ కాంప్లెక్స్ వద్ద రాత్రి 8 గంటలకు "సంఘం శరణం గచ్చామి" అనే నాటకాన్ని ప్రదర్శించడం జరుగుతుందన్నారు. హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాబృందంచే అంబేద్కర్ జీవిత చరిత్ర నాటకాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించనున్నట్లు తెలిపారు. అంబేద్కర్ అనుభవించిన అంటరానితనం, ఆయన చదువుకున్న చదువులు, ఈ దేశ ప్రజల కోసం ఆయన చేసినటువంటి పోరాటం, కృషి వీటన్నింటిని ఈ నాటకం ద్వారా ప్రదర్శించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఈ నాటకాన్ని తిలకించాలని కోరారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు రాజప్ప, రత్నమ్మ, సరస్వతమ్మ, శశికళమ్మ, లక్ష్మీదేవమ్మ, నాగేష్, గోపాలకృష్ణ, వెంకటేష్, సంజీవ రాయుడు, రామాంజి, మధు తదితరులు పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

బహుజన సంకల్ప సభను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో మే 7న బిఎస్‌పి ఆద్వర్యంలో చేపట్టిన బహుజన సంకల్ప సభను విజయవంతం చేద్దామని బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ శ్రీరాములు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక బిఎస్‌పి కార్యాలయంలో నియోజకవర్గ కన్వీనర్ చౌళూరు రామాంజనేయులు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతు బహుజనులకు రాజ్యాధికారం లేకపోవడంతోనే అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. సంకల్ప సభకు రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ లు రిటైర్డ్ డిజిపి జె పూర్ణచంద్ర రావు, బక్కాపరంజ్యోతి, ఆర్జే మల్లీకల్ హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశంలో ఆపార్టీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి కొల్లకుంట వడ్డే నాగరాజు, జిల్లా కోశాధికారి హరి కుమార్, నియోజకవర్గ నాయకులు సుబ్బరాయప్ప, చిరంజీవి, మౌలాలి, ఎస్ఆర్ పల్లి శ్రీనివాసులు, ఫకృద్దీన్ సాబ్, నరసింహప్ప, నారాయణ స్వామి, గంగాధరప్ప, బండారు లక్ష్మి, నారాయణ, ప్రసాద్, రాజప్ప, షంషాద్, పల్లా నరసింహులు, రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎ అనుమతులు ఇవ్వాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప

సంస్థ సేవలు నిలిచి పోకుండా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం


ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాయలసీమ జిల్లాల ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచి సంక్షేమాభివృద్ధి, విద్య, వైద్యం, వ్యవసాయం రంగాల్లో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి) సేవలు నిలిచిపోకుండా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆర్‌డిటి సేవలకు అడ్డంకిగా నిధులు ఆపడాన్ని నిరసిస్తూ ఆర్‌డిటి సేవలు- ఆటంకాలు అనే అంశంపై ఏపి వ్యవసాయ కార్మిక, సంఘం, ఏపి రైతు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించారు. వ్యవసాయ కార్మికసంఘం, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ అనంతపురం జిల్లా నిత్యం కరువు, వలసలు, ఆత్మహత్యలతో సతమతమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్న దళిత, గిరిజన, బడుగుల జీవితాల్లో మార్పు తీసుకు రావడం కోసం ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1969లో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఏర్పడిందన్నారు. ఈ ట్రస్టు ఎన్నో విప్లవాత్మకమైన అభివృద్ధిని ప్రజలు, ప్రభుత్వాలు, దాతల సహకారంతో చేసిందన్నారు. జిల్లాలో సెమి గవర్నమెంట్ లాగా ఆర్డీటీ సేవలు 3244 గ్రామాల నుండి 3896 గ్రామాలకు 4,51,200 కుటుంబాలకు విస్తరించాయని తెలిపారు. వివిధ సంస్థలు, దాతల సహకారంతో చేస్తున్న సేవలు విస్తరించడమే కాకుండా ప్రపంచ గుర్తింపు పొందిందని అన్నారు. అయితే కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం సేవా సంస్థలపై దాడిని పెంచిందన్నారు. ఎఫ్‌సిఆర్ఎ చట్ట సవరణను తెచ్చి ఆర్‌డిటికి వస్తున్న నిధులకు ఆంక్షలు విధించడం పెరిగిందన్నారు. కుల, మతాలకు అతీతంగా సేవలు అందిస్తున్న ఆర్‌డిటి మత ప్రచారాలు, మత మార్పిడులు చేస్తోందని తప్పుడు ప్రచారం చేసి పేదలు, దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలకు ఇస్తున్న సేవలకు దూరం చేస్తోందన్నారు. దీంతో అన్ని రంగాలకు చెందిన ప్రజలు నష్టపోతారని తెలిపారు. తక్షణం ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎ రెన్యువల్ చేయాలని, సంస్థకు నిధుల సమస్య తీరేంత వరకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో ఆర్‌డిటి నిధులు, ఎఫ్ సిఆర్ఎల పునరుద్ధరణ కోసం చర్చలు జరపాలన్నారు. ఈ విషయంపై ఎంపీలు, ఎమ్మెల్యేలు చొరవ చూపాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని ఆర్‌డిటి రక్షించుకునేందుకు ముందుకు వెళ్లాలని సమావేశంలో తీర్మానించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో రిటైర్డు డిప్యూటీ కలెక్టర్ డి.గోవిందరాజులు, మానవ హక్కుల వేదిక నాయకులు ఎస్ఎం.బాషా, ఎస్సీ, ఎస్టీ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు నెరమెట్ల ఎల్లన్న, కెవిపిఎస్ రాష్ట్ర ఆధ్యక్షులు ఓ.నల్లప్ప, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు ఓబిలేసు, అనంత హుక్కల వేదిక సోమర రాహూల్, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి. శివారెడ్డి, బిఎంకెఎస్ కేశవరెడ్డి, లత్తవరం మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్, ప్రజా నాట్య మండలి శ్రీనివాసులు. ఆర్‌వి సాయకుమార్, హెచ్.గంగాధర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి ఉదయ్ భాస్కర్





జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి ఉదయ్‌భాస్కర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

విద్యతో పాటు యువత క్రీడలలో రాణిస్తే వారి భవిష్యత్తు బంగారు బాటగా మారి జీవితంలో స్థిరపడతారని జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి ఉదయభాస్కర్ పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జోనల్, రాష్ట్ర, జాతీయస్థాయిల్లో వివిధ క్రీడల్లో రాణించి పతకాలతోపాటు ప్రభుత్వాల నుంచి గుర్తింపబడిన క్రీడాకారులు ఎందరో ఉన్నారు. ప్రభుత్వం కూడా క్రీడలను ప్రోత్సహిస్తూ క్షేత్రస్థాయిలో పలుచోట్ల స్టేడియాలను నిర్మించింది. అయితే వాటి నిర్వహణ సరిగా లేకపోవడం, వాచ్‌మెన్‌లను నియమించకపోవడం వల్ల పలుచోట్ల స్టేడియంలు నిరుపయోగంగా మారుతున్నాయి. చివరకు అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. దీంతో ప్రభుత్వం వ్యయం చేసిన నిధులు వృథా అవుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని నిర్వహణకు సంబంధించి తగిన సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో గేమ్స్ కోటా ద్వారా ఎంపికైన వారు ఎందరో ఉన్నారు. అలాగే క్రీడల్లో మాత్రమే రాణించి చదువులో లేకుంటే ఆ క్రీడాకారులకు తగిన ఉద్యోగ అవకాశాలు ఉండవు. ప్రభుత్వం కూడా క్రీడా శాఖ ద్వారా అవసరమైన చోట స్టేడియంలు నిర్మించి యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో క్రీడల అభివృద్ధి, శిక్షణలపై జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి ప్రజాశక్తి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న : జిల్లాలో మీ శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి.?

జవాబు : జిల్లాలో క్రీడల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నాము. క్రీడలకు సంబంధించి ఐదుగురు శిక్షణ కోచ్‌లు ఉన్నారు. బాక్సింగ్, హాకీ, అథ్లెటిక్స్ (పరుగు, షాట్ పుట్), కత్తి యుద్ధం, జూడో తదితర క్రీడల పైన ఆసక్తిగల యువతకు కోచ్‌లు శిక్షణ ఇస్తారు. బాక్సింగ్, హాకీ క్రీడలు ధర్మవరం ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక స్థలంలో శిక్షణ ఇస్తాం. కత్తి యుద్ధం కదిరి జెడ్పీ పాఠశాలలో, అథ్లెటిక్స్ (పరుగు, షాట్ పుట్) క్రీడలు జిల్లాలో రామగిరిలోని క్రీడా వికాస్ కేంద్రంలో, షటిల్ పెనుకొండ క్రీడా వికాసం కేంద్రంలో, జూడో చిగిచర్ల జడ్పీ పాఠశాల గ్రౌండ్ లో శిక్షణ ఇస్తాం. ఈ శిక్షణ పొందిన వారు జోనల్, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో జరిగే క్రీడల పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది.

ప్ర : గ్రామీణ క్రీడలకు అందిస్తున్న సహకారం ఏమిటి.?

జ: గ్రామీణ యువతకు ప్రోత్సాహం అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వం బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందిస్తుంది. అంతేగాక కళాశాలలో విద్యను అభ్యసించడానికి క్రీడా కోటా క్రింద మెడిసిన్, ఇంజనీరింగ్ తదితర రంగాల్లో సీట్లు పొందవచ్చు. ఇందుకు ప్రభుత్వం క్రీడలకు 2 శాతం సీట్లు కేటాయిస్తుంది. అలాగే క్రీడల్లో బాగా రాణించిన యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో అంటే పోలీస్, ఫైర్, ఫారెస్ట్, రక్షణ రంగాల్లో 3 శాతం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తారు.

ప్ర: క్రీడా పోటీలు ఎక్కడెక్కడ నిర్వహిస్తారు.?

జ: మేము ఆయా క్రీడల్లో శిక్షణ మాత్రమే ఇస్తాము. జోనల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు అసోసియేషన్లు ఉంటాయి. అవి క్రీడల్లో బాగా రాణించిన వారిని ఎంపిక చేస్తాయి. అందులో బాగా రాణించి ప్రతిభ చూపించిన క్రీడాకారులకు నగదు బహుమతులు ప్రశంసా పత్రాలు అందిస్తారు. అలాగే చదువులో కూడా ప్రతిభ చూపించిన వారికి క్రీడ కోటా క్రింద ఉద్యోగాలు కూడా పొందే అవకాశం ఉంటుంది. గత ఏడాది మార్చి నుండి ఇప్పటివరకు సుమారు 1500 మంది యువతకు వివిధ క్రీడలలో శిక్షణ ఇచ్చాం.

ప్ర : మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా.? యువతకు మీరు ఇచ్చే సూచనలు సలహాలు ఏమిటి.?

జ: మా శాఖపరంగా సిబ్బంది కొరత ఉంది. సీనియర్ అసిస్టెంట్, అకౌంటెండ్, కోచ్‌ల కొరత ఉంది. బాస్కెట్ బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్ తదితర క్రీడలకు కోచ్‌లు అవసరం. ప్రస్తుతం అయితే ఉన్న వారితోనే సరిపెట్టుకుంటున్నాం. క్రీడాకారులకు మేము ఇచ్చే సలహా ఏమిటంటే క్రీడలతో పాటు చదువు కూడా ముఖ్యమే. క్రీడలు, విద్య అనేవి రెండు కళ్లు లాంటివి. ఈ రెండింటిలో రాణించే వారికి భవిష్యత్ బాగా ఉంటుంది. క్రీడల్లో రాణించి విద్య లేకపోతే ఉద్యోగ అవకాశాలు ఉండవు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో స్థిరపడాలని యువతకు సలహా ఇస్తున్నాం.

నేడు కలెక్టరేట్లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయం ప్రకటించింది. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు వారికి సంబంధించిన సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు అందజేయాలన్నారు.

పెనుకొండ కోర్టు భవనాల పరిశీలన

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పెనుకొండ కోర్టు భవనాలను జిల్లా జడ్జి భీమ్‌రావు ఆదివారం పరిశీలించారు. రోడ్లు భవనాల అతిథి గృహంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు జిల్లా జడ్జికి ఘన స్వాగతం పలికారు. ఎజిపి ఎం.భాస్కర్ రెడ్డి జిల్లా న్యాయమూర్తికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీవో టి.ఆనంద్ కుమార్, తహశీల్దార్ శ్రీధర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పంట రుణాలు రెన్యువల్ చేసుకోండి

ప్రజాశక్తి-గాండ్లపెంట

సకాలంలో పంట రుణాలు రెన్యువల్ చేసుకోవాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పి.భరత్ ప్రవీణ్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. మండలంలో దాదాపు 3080 మంది రైతులు రుణాలు రెన్యువల్ చేసుకోవాల్సి ఉందన్నారు. అందులో ఇప్పటికి 200 మంది రెన్యూవల్ చేసుకున్నారని చెప్పారు. మిగిలిన రైతులు నిర్ణీత గడువులోపు రెన్యువల్ చేసుకోవాలని తెలియజేశారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని పుట్టపర్తి రోడ్ సాయిబాబా గుడి వద్ద ఉన్న స్పందన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ఊపిరితిత్తుల సంబంధిత ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. స్పందన ఆసుపత్రి అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో పల్మలాలజిస్ట్ డాక్టర్ కె.పూర్ణచంద్ర వైద్య పరీక్షలు చేశారు. 88 మందికి ఉచితంగా వైద్య చికిత్సలు చేసి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ బాబా ఫక్రుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి : ఆవాజ్

ప్రజాశక్తి-ముదిగుబ్బ

కాశ్మీర్‌లో ఉగ్రదాడికి పాల్పడి ప్రజల ప్రాణాలను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఆవాజ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆవాజ్ ప్రధాన కార్యదర్శి బాబ్జాన్ మాట్లాడుతూ పెహల్గాంలో ఉగ్రదాడి అత్యంత విచారకరం అన్నారు. ఇందులో పాల్గొన్న ఉగ్రవాదులందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మరణించిన కుటుంబ సభ్యులకు అన్ని విధాలా కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చికెన్ రఫీ రహీం, టైలర్ ముస్తఫా, బాబా ఫక్రుద్దీన్, అల్లా బక్షు, పక్కీరప్ప పాల్గొన్నారు.

5న పోస్టుకార్డుల ఉద్యమం

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ మే 5న రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రధాని మోడీకి పోస్ట్‌కార్డుల ఉద్యమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం కదిరి పట్టణంలో బోయ కులస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకి బోయలు ప్రతి జిల్లా నుంచి తప్పకుండా పోస్ట్ కార్డు ఉద్యమంలో పాల్గొని మోడీకి ఉత్తరం పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆనంద్, మేకల శివ ప్రసాద్, సురేష్ బాబు పాల్గొన్నారు.

శక్తి పోలీస్ యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-మడకశిర

శక్తి పోలీస్ యాప్‌పై టిడిపి నాయకులు ఆదివారం పట్టణంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బొమ్మయ్య చంద్రశేఖర్, రేషన్ డీలర్ రవిబాబు ఆధ్వర్యంలో యాప్ ప్రయోజనాలను ప్రజలకు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ శక్తి పోలీస్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని తెలియజేశారు.

గుడిఆవరణలో షెడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల కేంద్రంలోని శ్రీ గణేశా హరిహర దేవాలయం ప్రాంగణంలో నూతన హంగులతో రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. బెంగుళూరుకు చెందిన నామ శైలజ పద్మనాభం వీటిని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 30వ తేదీ ఆలయంలో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న వారికి ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ క్రిష్ణం సూర్యనారాయణ, అంబటి హరినాథ్, అర్చకులు రఘునాథ్ శాస్త్రిలు అభినందనలు తెలిపారు.

పాముదుర్తిలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండల పరిధిలోని పాముదుర్తి గ్రామంలో సత్యసాయి యూనివర్సిటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. యునైటెడ్ కింగ్డమ్‌కు చెందిన డాక్టర్లు 173 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 20 మందిని మెరుగైన వైద్య చికిత్సల కోసం పుట్టపర్తి, బెంగళూరు హాస్పటల్‌కు పంపారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సత్యసాయి బాబా సేవా స్ఫూర్తితో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జ్యోతి, డాక్టర్ల బృందం సుమ, ప్రశాంత్, నిఖిల్, కృష్ణాంజి, సీమ పాల్గొన్నారు.



ధర్మవరంలో విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

5న సిపిఎం ఆధ్వర్యంలో మహాధర్నా

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి - మౌలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

జిల్లాలోని పేదలందరికీ ఇళ్ల స్థలాలు, గృహాలు ఇవ్వాలని, మౌలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మే 5వ తేదీన కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం నాయకులు తెలిపారు. ధర్మవరం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్.బాషా మాట్లాడుతూ జిల్లాలో అనేకమంది పేద, దళిత, గిరిజన, మైనార్టీలు, వెనుక బడిన వర్గాల ప్రజలు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పేదలందరికీ ఇళ్ల పట్టాలిచ్చి, ఇళ్లు నిర్మించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అన్ని వర్గాల వారికి శ్మశాన వాటిక స్థలాలను కేటాయించాలన్నారు. పట్టణ ప్రజలకు కేటాయించిన టిడ్కో గృహాలు, గత ప్రభుత్వంలో ఇచ్చిన జగన్న ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అందజేయాలన్నారు. మడకశిర, లేపాక్షి ప్రాంతాల్లో సెజ్ పేరిట ప్రభుత్వం రైతులతో తీసుకున్న భూముల్లో ఎలాంటి పరిశ్రమలూ ఏర్పాటు చేయని నేపథ్యంలో ఆ భూములను తిరిగి నిర్వాసిత రైతులకు ఇచ్చేయాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక సమస్యలను పరిష్కరించేలా వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ మే 5వ తేదీన సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ధర్నాలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతి, సిఐటియు నాయకులు ఆదినారాయణ, హైదర్ వలి తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం అధ్వర్యంలో మే 5న కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈఎస్.వెంకటేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కదిరిలో జరిగిన పార్టీ పట్టణ కమిటీ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పేదల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వివిధ రూపాల్లో ఆందోళన చేశామన్నారు. గత నెలలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. అందుకని ఈ నెల 24 నుంచి 26 వరకు జిల్లా వ్యాప్తంగా రిలే నిరహార దీక్షలు చేశామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11నెలలు పూర్తయిన గతంలో ఇచ్చిన హామీ ప్రకారం పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇవ్వాలన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. ఈ సమస్యలపై మే 5న చేపట్టిన మహాధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు జడ్పీ శ్రీనివాసులు, జిఎల్.నరసింహులు, పట్టణ నాయకులు జగన్, సాంబ, రామ్మోహన్, బాబ్జాన్, శాంతిబాయి, శివ పాల్గొన్నారు.



కదిరిలో విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

మృతుని కుటుంబానికి పరామర్శ



బుగ్గయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని ఆర్.కొట్టాల గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు బుగ్గయ్య కుమారుడు రవితేజ గత 10 రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నరహరి, సీనియర్ నాయకులు మాధవ నాయుడు, చంద్రమౌళి, వెంకటరామిరెడ్డి, త్రివేంద్రం నాయుడు, చిన్నమంతురు పవన, శ్రీనాథ్ చౌదరి, వీరాంజి, జానకి, సిద్దన్న పాల్గొన్నారు.

పాత్రికేయునికి పరామర్శ

మండలం కేంద్రంలోని సూర్య దినపత్రిక విలేకరి మహబూబ్ బాషా పది రోజుల క్రితం గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి గాయపడ్డాడు. చికిత్స అనంతరం ఇంటికొచ్చిన ఆయన్ను మంత్రి సవిత భర్త వెంకటేశ్వరావు పరామర్శించారు.

రైతులకు అండగా అతియ ఫార్మర్స్ కంపెనీ

ప్రజాశక్తి-కదిరి టౌన్



దాణా పంపిణీ చేస్తున్న అతియా ఫార్మర్స్ ప్రతినిధులు

కరువు ప్రాంతంలో అతియ ఫార్మర్స్ కంపెనీ రైతులకు అండగా నిలుస్తోందని ఆ కంపెనీ సీఈవో వెంకటేష్ నాయక్ తెలిపారు. ఈ కంపెనీ ఆధ్వర్యంలో కదిరి, నల్లమడ, తలుపుల మండలాలకు సంబంధించి రైతులకు సబ్సిడీ దాణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఈవో వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఆతియా ఫార్మర్ కంపెనీ తరపున శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పాడి రైతులను ఆదుకునే విధంగా తమ కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా పాడి రైతుల కోసం గేదెలకు సబ్సిడీతో కూడిన దాణ, మల్చింగ్ షీట్, టర్పాళ్లను ఇస్తున్నట్లు చెప్పారు. రైతుల భూమిలో రాళ్లు తొలగించే కార్యక్రమం చేస్తున్నామన్నారు. ఎరువులు విత్తనాలు, డ్రిప్ పరికరాలను సబ్సిడీతో అందజేస్తామని చెప్పారు. మామిడి, చీనీ మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బాలకృష్ణ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేష్, విసిఒలు పాల్గొన్నారు.

మానస నృత్య కళాకేంద్రం 5వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్



ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ధర్మవరం పట్టణంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం మానస నృత్య కళాకేంద్రం 5వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మానస నత్య కళాకేంద్రం ఆధ్వర్యంలో శ్రీనివాస కళ్యాణం నృత్యరూపకాన్ని నిర్వహించారు. గంటపాటు నిర్విరామంగా నృత్యరూపకం చేశారు. 25 మంది చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమం అనంతరం నాట్యచారిని ముంగుర హరిణి, పెద్దిపోగు ఆనంద్, బాపనపల్లి వెంకటస్వామి చేతుల మీదుగా మానసను సన్మానించారు.

చేనేత కార్మికులను ఆదుకోండి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

చేనేత కార్మికులను ఆదుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకోవాలని ఎపి చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని చేనేత సంఘం కార్యాలయంలో ఆ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు సీనియర్ నాయకులు ఎస్‌హెచ్.బాషాలు మాట్లాడుతూ చేనేత కార్మికులకు నేతన్న నేస్తం రూ.24వేల ఇవ్వాలన్నారు. మగ్గాలున్న వారికీ 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అమలు చేయాలన్నారు. ముద్ర లోన్లని ఇవ్వాలన్నారు. చేనేతల అన్ని రుణాలనూ మాఫీ చేయాలని కోరారు. చేనేత కార్మికుల నివాసానికి పట్టణంలో 2.50 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అనంతరం ఎపి చేనేత కార్మిక సంఘం పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కన్వీనర్‌గా గుంపు హరి, కో కన్వీనర్‌గా ఖాదర్ బాషాను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు మారుతి, హైదర్ వలి, వెంకటస్వామి, లోకేష్, నాగరాజు, రషీద్ పాల్గొన్నారు.

ఎస్ఎస్‌కె కళాశాలలో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-పావగడ

ప్రతిష్టాత్మక సంస్థల సహకారంతో పట్టణంలోని శాంతి ఎస్ఎస్‌కె డిగ్రీ కళాశాలలో ఉద్యోగ ఎంపిక ప్రాంగణ నియామకాల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శనిమహాత్మ కార్యనిర్వాహక సంఘం అధ్యక్షుడు సిఎన్.ఆనందరావు, కార్యదర్శి పివి.సుబ్బనర సింహ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 17 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వినయ్ బాబు, అధ్యాపకులు అబ్దుల్ బారీ, నాగార్జున, కిరణ్, రవి, విజయమ్మ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాలాచార్యులు, కార్యదర్శి ఆకులేటి రమేష్ బాబు, కోశాధికారి ఉలవల నాగేంద్ర మాట్లాడుతూ ప్రజలకు కంటి సమస్యలను పరీక్షించి, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయించేలా లయన్స్ క్లబ్ నిరంతరం పని చేస్తోందని చెప్పారు. ధర్మవరం ప్రాంతంలో ఇప్పటికే 70వేల మందికి శస్త్రచికిత్సలు చేయించామని చెప్పారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి గూడూరు నాగయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు గూడూరు మోహన్ దాస్‌లు దాతలుగా వ్యవహరించారని చెప్పారు. ఆదివారం నాటి శిబిరంలో 93 మంది కంటి రోగులు, వైద్యచికిత్సలను అందుకోగా అందులో 72 మందిని శస్త్ర చికిత్సల నిమిత్తం ఎంపిక చేశారు. వైద్యులు డాక్టర్ నాగేంద్ర పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మెటికల కుళ్లాయప్ప, రాజగోపాల్, సాగా సురేష్, గోశే రాధాకృష్ణ, గవ్వల రాధాకష్ణ, చందా నాగరాజు, పార్థసారథి పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధితో గుర్తింపు : మైనాస్వామి



మైనాస్వామిని సన్మానిస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి-గోరంట్ల

శ్రీసత్యసాయి జిల్లా హేమావతి పర్యాటక వలయం పనులు ప్రారంభమైతే జిల్లా పర్యాటక ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని పర్యాటకరంగ నిపుణుడు, చరిత్రకారుడు మైనాస్వామి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం మైనా స్వామి అందుకున్న సందర్భంగా పట్టణంలో మాధవరాయ దేవాలయంలో జనసేన నాయకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో మైనా స్వామిని ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరికొత్త పర్యాటక వలయం ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందన్నారు. హేమావతి, లేపాక్షి, పెనుకొండ, గోరంట్ల, మేరెడ్డిపల్లి, వానవోలు, కదిరి, కటారుపల్లి, తిమ్మమ్మ మర్రిమాను తదితర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి జరుగాయన్నారు. పర్యాటకరంగం అభివృద్ధి చెందితే జిల్లా ఆర్థికాభివృద్ధి మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు రాయుడు, రామకృష్ణ, అర్జ శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భక్తవత్సలం, బిజెపి నాయకుడు సాయిరాం, టిడిపి నాయకుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువులోనే శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి కె.జయరాం తెలిపారు. ఏప్రిల్ 29 నుంచి జూన్ 6వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, కథలు, క్రీడలు ఆటలు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

లేపాక్షి : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు 40 రోజులు పాటు పిల్లలకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి జయసింహరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల అ'పూర్వ' కలయిక

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో పూర్వ విద్యార్థులు అ'పూర్వ' కలయికను ఆదివారం నిర్వహించుకున్నారు. తాము చదివి పాఠశాలల్లో కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఓబుళదేవరచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎస్.జమాల్, బాబా ఫక్రుద్దీన్, రామచంద్రారెడ్డి, పాల్గొని పూర్వ విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరాజు, మహేశ్వర్ రెడ్డి, నరసింహులు, రమేష్, మాబాషా, నాగరాజు పాల్గొన్నారు.

తాడిమర్రి : మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-2000 సంవత్సరంలో ఆరవ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలిక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. చిన్ననాటి మిత్రులు అందరూ ఒక చోట కలిసి సరదాగా గడిపారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు విజయ్ కుమార్, శ్రీనివాసులు, శ్రీధర్ బాబు, ఓబులేసు, చంద్రమౌళీశ్వర గుప్తా, దేవకీదేవిలను సన్మానించారు. చదువుకున్న పాఠశాలకు తమవంతు సాయం అందిస్తామన్నారు. తోటి స్నేహితుడు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో ఆర్థిక సాయం అందించారు.

బత్తలపల్లి : బత్తలపల్లి ఎస్‌కెజిఎం కళాశాలలో 17 సంవత్సరాల క్రితం ఇంటర్మీడియట్ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం లక్ష్మీ కళ్యాణమండపంలో కలుసుకున్నారు. ఆనాటి విద్యార్థుల అందరూ ఒక చోట చేరి ఎంతో సంతోషంగా గడిపారు. పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. బత్తలపల్లి మండల కేంద్రంలోని ఎస్‌కెజిఎం కళాశాలలో 2008-2010లో ఇంటర్మీడియట్ బ్యాచ్‌లో 130 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేయగా అందులో 90 మంది కుటుంబ సభ్యులతో సహా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పటి కళాశాల కరస్పాండెంట్ కమతం ఈశ్వరయ్య, ప్రిన్సిపాల్ జ్వాలారెడ్డి, అధ్యాపకులు పాపన్న, సూర్యనారాయణ, వన్నూరుసాహెబ్, నాగరాజులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాటి అధ్యాపకులను సన్మానించారు.

చెన్నేకొత్తపల్లి : మండల పరిధిలోని మేడాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 1992- 93, 2002-03 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం నాడు ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. మేళతాళాలతో గ్రామంలో ఉపాధ్యాయులను ఊరేగించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయం అందిస్తామని విద్యార్థులు తెలియజేశారు.



బత్తలపల్లిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



తాడిమర్రిలో..



చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురంలో..



ఓబుళదేవరచెరువులో..

నేరాలు ఘోరాలు

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

వారం రోజుల తర్వాత వెలుగు చూసిన విషాదం

ప్రజాశక్తి - చిలమత్తూరు



ఇబ్రహీం(ఫైల్ ఫొటో)

చింతచిగురు కోసం చెట్టుపైకి ఎక్కి దానిపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఓ వ్యక్తి మరణించిన ఘటన మండల కేంద్రంలోని శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలోని పాడుబడిన ఆరోగ్య ఉపకేంద్రం భవనంపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిలమత్తూరు కింద బస్టాండ్ ప్రాంతానికి చెందిన ఇబ్రహీం (40) ఈ నెల 19న చింతచిగురు కోసం పాడుబడిన భవనం పక్కన ఉన్న చింత చెట్టుపైకి ఎక్కాడు. చిగురు కోస్తుండగా అదుపు తప్పి జారిపడి అక్కడే మతి చెందాడు. ఆ ప్రాంతంలో ఎవ్వరూ లేకపోవడంతో ఆయన్ను గర్తించలేదు. మతదేహం వారం రోజుల పాటు భవనం పైభాగంలోనే అలాగే ఉండిపోయింది. ఆదివారం ఉదయం చింతచిగురు కోసం అదే ప్రాంతానికి వెళ్లిన స్థానికులు భవనంపై పడి ఉన్న మతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారాన్ని చేరవేశారు. మతుడి ప్యాంటు జేబులో చింతచిగురు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. మతదేహాన్ని పంచనామా నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మతుడికి ఒక కుమారుడు ఉన్నాడు. భార్య అమీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన విద్యార్థి మృతి

ప్రజాశక్తి - చిలమత్తూరు



చరణ్‌యాదవ్(ఫైల్ ఫొటో)

చిలమత్తూరు గ్రామానికి చెందిన జి.చరణ్ యాదవ్(15) హిందూపురం నారాయణ పాఠశాలలో 10 తరగతి చదువుతున్నాడు. పది చివరి పరీక్ష సాంఘిక శాస్త్రం రాసి సొంత గ్రామానికి ద్విచక్ర వాహనానంలో వస్తుండగా శ్రీకంఠపురం చెరువు కట్ట మీద ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో విద్యార్థి చరణ్ యాదవ్ తల వెనుక బాగంలో బలంగా దెబ్బతగిలింది. దీంతో విద్యార్థి కోమాలోకి వెళ్లాడు. అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే పరిస్థితి విషమించి ఆదివారం మరణించాడు. మరణించిన విద్యార్థి నారాయణ పాఠశాలలో పది ఉత్తీర్ణత సాధించి పాఠశాలలో మూడోస్థానంలో నిలిచాడు. ప్రతిభా విద్యార్థి ఇలా ప్రమాదంలో మరణించడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను తీవ్రంగా కలచివేసింది.

నాచేపల్లిలో మతిస్థిమితం లేని వ్యక్తి..

ప్రజాశక్తి-గుడిబండ

మండల పరిధిలోని నాచేపల్లి గ్రామానికి చెందిన భూతప్ప కుమారుడు గోవిందప్ప(60) ఆదివారం మృతి చెందాడు. మృతుని భార్య భాగ్యమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... గోవిందకు మతిస్థిమితం సరిగా ఉండేది కాదు. శనివారం నాడు తన ఇంటి వద్ద ఉన్నఫలంగా బొక్క బోర్ల పడి మతి చెందాడు. కాగా తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ రమణ తెలిపారు.

సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

ప్రజాశక్తి-బత్తలపల్లి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ

మండలంలోని వివిధ గ్రామాల్లో రౌడీ షీటర్లు, పాత నేరస్తులు సమస్యలను సృష్టించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ హెచ్చరించారు. బత్తలపల్లి పోలీస్ రికార్డుల్లో రౌడీషీటర్లుగా నమోదైన వారికి ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరప్రవృత్తిని విడనాడి ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్, ఆర్‌పి ఎస్ఐ గోవిందు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే చర్యలు

ధర్మవరం రూరల్ : ధర్మవరం పట్టణంలోని టూటౌన్ పరిధిలో రౌడీషీటర్లు గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సిఐ రెడ్డప్ప హెచ్చరించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సిఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో జీవించాలన్నారు. గొడవలకు వెళ్లినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామాల్లో పోలీసుల తనిఖీలు

ముదిగుబ్బ : పట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరగారిపల్లి, తాడిమర్రి మండలంలోని శివంపల్లి గ్రామాల్లో సిఐ శ్యామ్ రావు ఆధ్వర్యంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లతోపాటు వ్యవసాయ గిడ్డంగులు, గడ్డివాములను తనిఖీ చేశారు. సైబర్ క్రైమ్, శక్తి యాప్, బెట్టింగ్, అసాంఘిక కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

కాంగ్రెస్ నేత హత్య దారుణం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్, సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణను హత్య చేయడం అత్యంత దుర్మార్గమైన చర్యని పుట్టపర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి తెలిపారు. లక్ష్మీనారాయణ హత్యకు కారకులైన నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని అనేందుకు లక్ష్మీనారాయణ హత్యోదయమే నిదర్శనం అన్నారు.

మురళీమోహన్‌కు టిడిపి నేతల నివాళి

ప్రజాశక్తి - చిలమత్తూరు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మురళీమోహన్ కుటుంబాన్ని ఆదివారం టిడిపి నేతలు పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. మురళీమోహన్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. పార్టీ మద్దతుగా నిలుస్తుందని మండల కన్వీనర్ రంగారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బేకరి గంగాధర్, కోడికొండ బాలాజీ, దేమకేతేపల్లి అంజినప్ప, అశ్వర్థప్ప, శ్రీదేవి, మరేష్, విజయ్, మురళీ, అంజి, నారాయణస్వామి, నంజిరెడ్డి, వినోద్, బాబు తదితరులు ఉన్నారు.

ఉచిత బస్సుప్రయాణం మాటేమిటి..?


వైసిపి అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి

ప్రజాశక్తి-మడకశిర

సూపర్-6లో భాగంగా మహిళలకు ఆర్టీసీలో ఇచ్చిన ఉచిత బస్సుప్రయాణం మాటేమిటని వైసిపి అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి ప్రశ్నించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి శనివారం నాడు మడకశిర నియోజకవర్గం పర్యటించారన్నారు. ఈ సమయంలో ఆయన మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై మాటమాత్రం కూడా మాట్లాడలేదన్నారు. వైసిపిని విమర్శించడమే పనిగా మంత్రి పర్యటన సాగిందన్నారు.

సజావుగా ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-రొద్దం



పరీక్షలను పరిశీలిస్తున్న అధికారులు

మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలలో ఐదవ తరగతి చదువుకోవడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షను ఆదివారం నిర్వహించారు. మండల కేంద్రంలో ఆర్.మరవపల్లి మహాత్మ జ్యోతిరావు బాపులే పాఠశాలలో ఐదవ తరగతికి 40 సీట్లు ఉండగా దాదాపు 200 మంది దరఖాస్తు చేసుకున్నారు. 196 మంది పరీక్షలు రాశారని ప్రిన్సిపల్ అనిత తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా అధికారులు యు.నిర్మల జ్యోతి, గంగాధర్, సుభాన్, దేవేంద్ర తనిఖీ చేశారు.